# నేపాల రాజ్యంలో
# శృంగేరీ జగద్గురువుల ధర్మసంస్థాపన



## ధర్మవిజయయాత్ర విశిష్ట సంచిక

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సభక్తిక ప్రచురణ


దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠాధీశ్వరులు
జగద్గురు శంకరాచార్యశ్రీశ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామివారు
జగద్గురు శంకరాచార్యశ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామివారికి
సాష్టాంగ ప్రణామాలు సమర్పిస్తూ...జగద్గురువుల పాదరేణువు,,,
మరుమాముల వెంకటరమణశర్మ, దర్శనమ్ సంపాదకులు

# నేపాల్‌లో శృంగేరీ జగద్గురువుల ధర్మసంస్థాపన

❁ 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ ❁



**భారతదేశానికి, నేపాల్‌కు మధ్య ఉన్న ఆధ్యాత్మిక ధార్మిక బంధం ఎంతో ప్రాచీనమైనది, పవిత్రమైనది. ఆ బంధాన్ని మరింత దృఢపరుస్తూ, హిమాలయ సానువుల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లిన అపూర్వ ఘట్టం ... ఆదిశంకరుల మార్గంలో నాడు జ్యేష్ఠ మహాసన్నిధానంవారి కఠోర దీక్ష... అదే ఒరవడితో నేడు శ్రీ సన్నిధానంవారి ధర్మవిజయయాత్ర ... ఆరు దశాబ్దాల ఆధ్యాత్మిక వారధి. సనాతన ధర్మ రక్షణే ఊపిరిగా, లోక కల్యాణమే లక్ష్యంగా సాగుతున్న శృంగేరి శారదా పీఠ గురుపరంపర చరిత్రలో జగద్గురువులు చేపట్టే 'విజయయాత్రలు' అత్యంత విశేషమైనవి. జగద్గురు ఆదిశంకరాచార్యుల అడుగుజాడల్లో నడుస్తూ, పీఠాధిపతులు చేసే ఈ ధర్మవిజయయాత్రలు భక్తజనులలో అనంతమైన ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిలిస్తాయి. ఈ పవిత్ర ప్రస్థానంలో రెండు అపూర్వమైన చారిత్రక ఘట్టాలు నేపాల్ గడ్డపై విశేషమైన ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం అప్పటి శృంగేరి శ్రీశారదా పీఠాధిపతులు..జ్యేష్ఠ మహాసన్నిధానంవారైన జగద్గురు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారు వేసిన పునాది, నేడు పీఠ ఉత్తరాధికారి జగద్గురు శ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారి పర్యటనతో ఇరు దేశాల ధార్మికబంధం ఇతోధికంగా విస్తరించింది. రెండు భిన్న కాలాల్లో జరిగిన ఈ మహత్తర యాత్రల సమగ్ర సమీక్ష ఇది.**

★ ★ ★

మార్చి 2, 1967న భారత సరిహద్దులోని రక్సాల్ వద్ద జగద్గురువులకు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష స్వాగతం లభించింది. గుత్తి సంస్థాన్ ప్రధాన నిర్వాహకులు శ్రీ తారాప్రసాద్ ఉపాధ్యాయ, నేపాల్ ముఖద్వారం వద్ద స్వామివారికి ఎదురేగి సాదర స్వాగతం పలికారు. వీర్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన భారీ పందిరిలో అశేష జనవాహిని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. హెటౌడా చేరుకున్న మహాస్వామికి అటవీ రేంజర్స్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఘన స్వాగతం పలికారు.

ఆ మరుసటి రోజు, మార్చి 3న, నేపాల్ మహారాజు శ్రీ మహేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్ స్వయంగా మహాస్వామిని సంప్రదించి, నేపాల్‌లో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలను తమ దివ్య కరకమలములచే నిర్వహించాలని భక్తిపూర్వకంగా ఆహ్వానించారు. రాజ కుటుంబం విన్నపాన్ని మన్నించిన జగద్గురువులు, ఆనాటి మధ్యాహ్నం నేపాల్ రాజధాని ఖాట్మండుకు బయలుదేరారు. మహారాజు మహేంద్ర పర్యవేక్షణలో స్వామి వారికి అపూర్వమైన రాజ లాంఛనాలతో స్వాగతం లభించింది. మార్గమధ్యంలో కలంకి వద్ద గుత్తి ట్రస్ట్ చైర్మన్ శ్రీ బడా గురుజా ఖగేంద్ర రాజ్ పాండే, ఇతర అధికారులు, భక్తులు నీరాజనాలు అర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ కారులో బత్తిస్‌పుతలిలోని మురారి భవన్ వరకు ఒక మహా శోభాయాత్రగా స్వామి వారిని తీసుకెళ్లారు. ఆ రోజు సాయంత్రం స్వామివారు శ్రీ పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు.

## ఆలయాల సందర్శన - మహారుద్రయాగ సంకల్పం

మార్చి 4న పవిత్ర బాగ్మతీ నదీ తీరంలోని అనేక ఆలయాలతో పాటు, పశుపతినాథుని దర్శించుకుని మహాస్వామి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి దివ్య పర్యవేక్షణలో ఐదు రోజులపాటు సాగే 'మహారుద్ర యాగం' అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైంది.

మార్చి 5 తెల్లవారుజామున భక్తపూర్ చేరుకున్న జగద్గురువులు ప్రసిద్ధ దత్తాత్రేయ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ సప్తమాతృకలను పూజించిన అనంతరం, సిద్ధేశ్వరి ఆలయంగా పిలువబడే గుహ్యేశ్వరి ఆలయాన్ని, తుల్జా భవానీ మందిరాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం బుధనీలకంఠ, బాలాజీ మందిరాలను సందర్శించారు. ఆ రాత్రి మురారి భవన్‌లో జరిగిన సభలో భారత రాయబారితో సహా అనేకమంది ప్రముఖులు పాల్గొనగా, అశేష జనసందోహాన్ని ఉద్దేశించి స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు.





**మౌన వ్రతం : మరుసటి రోజు (మార్చి 6) ఏకాదశి పర్వదినం కావడంతో, జగద్గురువులు పూర్తి మౌన వ్రతాన్ని పాటించి అంతర్ముఖులయ్యారు.**

### బాలవేదపండితులకు ఆశీస్సులు - విశేష సందర్శనలు

మార్చి 7న వందలాదిగా వచ్చిన భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం భారత దౌత్య కార్యాలయానికి విచ్చేసిన స్వామివారు, అక్కడి భక్తులను ఉద్దేశించి హిందీలో అద్భుతమైన ప్రవచనం చేశారు. అనంతరం భారత రాయబారి తన నివాసంలో స్వామివారికి పాదపూజ చేసి తరించారు. మార్చి 8వ తేదీన భక్తుల ఇళ్లకు వెళ్లి పాదపూజలు స్వీకరించిన స్వామివారు, సాయంత్రం బాలాజు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మరియు మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఆదిశేషునిపై ఆసీనులై ఉన్న లక్ష్మీనారాయణుల భారీ ఏకశిలా విగ్రహాన్ని వీక్షించారు.


### త్రిభువన్ విశ్వవిద్యాలయంలో వేదనాదం

విశ్వవిద్యాలయంలోని ఎనిమిది నుంచి పదేళ్ల వయసున్న చిన్నారి విద్యార్థులు అద్భుతమైన స్పష్టతతో వేద మంత్రాలను పఠించడం జగద్గురువులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆ చిన్నారుల నైపుణ్యానికి ముగ్ధులైన స్వామివారు, వారికి మరియు ఉపాధ్యాయులకు ప్రత్యేక నగదు బహుమతులు అందించి ఆశీర్వదించారు. తర్వాత సైనిక మైదానంలో భారీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. భగవత్ భవన్‌ను, 2000 సంవత్సరాల నాటి అత్యంత పవిత్రమైన బౌద్ధ చైత్యం 'స్వయంభు'ను దర్శించుకుని తిరిగి మురారి భవన్ చేరుకున్నారు.

### మహాశివరాత్రి మహోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన జగద్గురువులు పశుపతినాథ్ ఆలయానికి కాలిబాటన బయలుదేరారు. వేద మంత్రాల ఘోషతో వేలాది మంది భక్తులు వారిని అనుసరించడం ఆ ప్రదేశాన్ని కైలాసంగా మార్చేసింది. పశుపతినాథునికి విశేష పూజలు చేసి, మంగళహారతి





अमृत उपदेश

స్వీకరించారు. నేపాల్ మహారాజు, మహారాణి స్వామి వారిని దర్శించుకుని, సుదీర్ఘ సంభాషణ జరిపి వారి ఆశీస్సులు పొందారు. రాత్రంతా జరిగిన శివరాత్రి మహాపూజను అశేష భక్తజనుల సమక్షంలో స్వామివారు స్వయంగా నిర్వహించారు. ఈ కన్నులపండుగను వీక్షించడానికి భారతదేశం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడం విశేషం.

### మహారుద్రయాగ పూర్ణాహుతి - రాజ సత్కారం

మార్చి 10వ తేదీ ఉదయం మహారుద్రయాగ 'పూర్ణాహుతి' ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. నేపాల్ రాజదంపతులు, భారత రాయబారితో సహా అనేకమంది ప్రముఖులు ఈ మహాక్రతువులో పాల్గొన్నారు.

- **రాజ కానుకలు :** భక్తిపూర్వకంగా నేపాల్ మహారాజు ఒక వెండి భరిణెను, పశుపతినాథ్ ఆలయ వెండి నమూనాను స్వామివారికి కానుకగా సమర్పించారు.
- **యాగ నిర్వహణ :** మహారుద్రయాగానికి సంబంధించిన పూర్తి ఖర్చును మహారాజు స్వయంగా భరించడం వారి అపార భక్తికి నిదర్శనం.
- శృంగేరీ మఠానికి ఒక భారీ కంచు గంటను బహూకరించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది.
- **శాశ్వత శిలాఫలకం :** జగద్గురువుల ఈ పవిత్ర యాత్రకు గుర్తింపుగా, వారి రాకను స్మరిస్తూ పశుపతినాథ్ ఆలయంలో అందరూ చూసేలా ఒక పెద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయించింది.

### సాదర వీడ్కోలు

మార్చి 11 మధ్యాహ్నం, బీహార్‌లోని మోతీహారి మీదుగా హెటౌడాకు వెళ్లేందుకు స్వామివారు ఖాట్మండు నుండి తిరుగు ప్రయాణమయ్యారు. వెళ్లే ముందు మరొక్కసారి పశుపతినాథుని దర్శించుకున్నారు. భారతదేశానికి తిరుగు ప్రయాణమవుతున్న జగద్గురువు




లకు నేపాల్ అపూర్వమైన, ఉద్వేగభరితమైన వీడ్కోలు పలికింది.

నేపాల్‌లో వారు బస చేసిన కాలంలో దాదాపు ఆరు భారీ బహిరంగ సభలలో ప్రవచనాలు చేయగా, 30,000 మందికి పైగా భక్తులు ఆ అమృతవాక్కులను ఆలకించి తరించారు. శృంగేరీ జగద్గురువుల నేపాల్ యాత్ర కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు.. అది రెండు దేశాల నడుమ ఆధ్యాత్మిక వంతెనను నిర్మించిన ఒక సువర్ణాధ్యాయం!

## 2026: సన్నిధానంవారి ధర్మ విజయయాత్ర

### ఆధునిక వికాసానికి దర్పణం

శృంగేరీ పీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు నేపాల్ దేశంలో చేపట్టిన ధర్మ విజయ యాత్ర అత్యంత వైభవంగా, దిగ్విజయంగా ముగిసింది. ఉభయ దేశాల భక్తుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఈ వారం రోజుల పర్యటన ఒక అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది. మంగళూరు నుండి ప్రత్యేక విమానంలో



ఖాట్మండు చేరుకున్న జగద్గురువులకు నేపాల్ ప్రభుత్వ యంత్రాంగం, ఆలయ ధర్మకర్తలు, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులు, వేలాది భక్తులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ కన్నుల పండువగా జరిగిన శోభాయాత్రలో పాల్గొని, ఘన స్వాగతం పలికారు.

ఆనాటి మహాస్వామి వారి దివ్య స్ఫూర్తిని, ధార్మిక సంకల్పాన్ని కొనసాగిస్తూ ఉభయ భారతీ ప్రకాశకులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు 2026 మే 22 నుండి 31 వరకు నేపాల్‌లో అత్యంత వైభవంగా 'ధర్మ విజయయాత్ర'ను నిర్వహించారు. ఈ యాత్ర పాత జ్ఞాపకాలను నెమరు వేస్తూనే, కొత్త తరానికి ధర్మమార్గాన్ని ఉపదేశించింది.

ఈ పర్యటనలో భాగంగా మే 25వ తేదీన ఖాట్మండులోని రాష్ట్రపతి భవన్‌కు గౌరవపూర్వక ఆహ్వానం మేరకు విచ్చేసిన జగద్గురువులకు నేపాల్ రాష్ట్రపతి శ్రీ రామ్‌చంద్ర పౌడెల్ దంపతులతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు సాంప్రదాయబద్ధంగా సాదర స్వాగతం పలికి అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నేపాల్ దేశం సకల అరిష్టాల నుంచి తొలగిపోయి, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని జగద్గురువులు ప్రత్యేక ఆశీర్వచనాలు, అనుగ్రహ భాషణం అందించారు.

శ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు స్వయంగా పశుపతినాథునికి జరిపిన విశేష రుద్రాభిషేకాలు, మహా పూజలు చూపరులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. జగద్గురువుల రాకతో ఆలయ ప్రాంగణమంతా శివ పంచాక్షరీ మహామంత్ర నాదంతో మారుమోగింది. స్వామి వారి కరకమలాలతో జరిగిన ఈ పవిత్ర పూజల ద్వారా పశుపతినాథుని దివ్య అనుగ్రహం యావత్ విశ్వానికి ప్రసరించిందని భక్తులు ఆనంద పారవశ్యానికి లోనయ్యారు.

- **ముక్తినాథ్ ధామ్‌లో పవిత్ర పూజలు :** ఎత్తైన హిమాలయ శ్రేణుల నడుమ, సాక్షాత్తూ శ్రీ



మహావిష్ణువు సాలగ్రామం రూపంలో కొలువైన ముక్తినాథ్ క్షేత్రంలో లోక కల్యాణార్థం శ్రీ సన్నిధానం వారు జరిపిన విశేష పూజలు భక్తులకు కనువిందు చేశాయి.

- **శ్రీ గలేశ్వరనాథునికి మహాభిషేకం :** కాళీగండకి నదీ తీరాన గలేశ్వర్ ధామ్‌లో ఒకే ఒక అఖండమైన శిలపై (చక్రశిల) కొలువైన శ్రీ గలేశ్వరనాథునికి భక్తిశ్రద్ధలతో మహాభిషేకం నిర్వహించి పరమశివుని కటాక్షాన్ని లోకానికి అందించారు. బుధనీలకంఠ లోని చారిత్రక విష్ణుమూర్తి ఆలయాన్ని సందర్శించి విశేష పూజలు చేశారు.
- **వశిష్ఠ గుహలో 'యోగ వాశిష్ఠ' ప్రబోధం :** దేవఘాట్ ధామ్‌లో, ముఖ్యంగా మహర్షి వశిష్ఠుడు తపస్సు చేసిన చారిత్రక 'వశిష్ఠ గుహ'ను సందర్శించడం ఒక అరుదైన ఘట్టం. ఆ పవిత్ర తపోభూమిలో వారు 'యోగ వాశిష్ఠం'పై చేసిన మృదుమధురమైన ప్రబోధం భక్తజనానికి స్ఫూర్తి దాయకంగా నిలిచింది.
- **సార్వజనీన అంగీకారం :** నేపాల్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విశేష సత్కారం, పోలీస్ ఉన్నతాధికారులు పశుపతినాథ్ మందిర నమూనాను బహూకరించడం ... రాజ్యాంగ వ్యవస్థలు సైతం ధర్మపీఠాల పట్ల చూపిస్తున్న గౌరవానికి ప్రతీక.

## రెండు తరాల సమన్వయం - చెక్కుచెదరని దివ్య లక్ష్యం

ఈ రెండు పర్యటనల నేపథ్యాలు, కాలాలు, భౌగోళిక పరిస్థితులు వేరైనా అంతరార్థం మాత్రం ఒక్కటే. నాటి యాత్ర భారత–నేపాల్ దేశాల మధ్య ఒక దృఢమైన ఆధ్యాత్మిక వారధికి శ్రీకారం చుట్టగా, నేటి యాత్ర ఆ మూలాలను మరింత బలోపేతం చేస్తూ ధర్మ మార్గాన్ని నలుదిశలా విస్తృతం చేసింది.

- **నాడు :** మహాస్వామి వారు అత్యంత కఠోరమైన వాతావరణంలో స్వయంగా శ్రమించి, అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి ధర్మ జ్యోతిని వెలిగించారు.
- **నేడు :** శ్రీ సన్నిధానం వారు తమ అపారమైన కరుణా కటాక్షాలతో, దివ్యమైన అనుగ్రహ భాషణాలతో నాడు నాటిన ఆ ధర్మ వృక్షాన్ని ఏపుగా, పచ్చగా పెంచుతున్నారు.

దేశాలు వేరైనా, దశాబ్దాలు మారినా శృంగేరి శారదా పీఠం యొక్క ధార్మిక సంకల్పం చెక్కుచెదరనిది. నేపాల్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా పాతుకుపోయిన ఈ భక్తిభావం, గురుపరంపర పట్ల వారు చూపుతున్న అపారమైన ప్రేమ... సనాతన ధర్మ వైభవానికి సజీవ సాక్ష్యాలు. ఈ రెండు చారిత్రక విజయ యాత్రల స్మరణం ప్రతి ధార్మిక హృదయానికీ సర్వదా ఆచరణీయం, అత్యంత పుణ్యప్రదం! ఈ యాత్రా విశేషాలు భావితరాలకు ఒక దిక్సూచిగా నిలిచిపోతాయి.

## పశుపతినాథుని సన్నిధిలో ధర్మవిజయ సందేశం

### నేపాల్ ధర్మ విజయయాత్రలో శృంగేరీ జగద్గురువుల అనుగ్రహ భాషణ సారాంశం

సనాతన ధర్మ వైభవాన్ని, ఆధ్యాత్మిక భారతీయ సంస్కృతిని, అద్వైత వేదాంత పరమార్థాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలో నిలిపిన జగద్గురు పరంపరలో శృంగేరీ శ్రీ శారదా పీఠానికి అపూర్వమైన స్థానం ఉంది. ఆ పరంపరలోని జగద్గురువులు నేపాల్ పుణ్యభూమిలో, మహిమాన్వితమైన శ్రీ పశుపతినాథ క్షేత్ర సన్నిధిలో నిర్వహించిన ధర్మ విజయయాత్ర సందర్భంగా చేసిన అనుగ్రహ భాషణాలు భక్తి, జ్ఞానం, తత్వబోధ, ధర్మోపదేశం అనే నాలుగు దివ్య ప్రవాహాలుగా భక్త జనులను పావనం చేశాయి.

ఈ భాషణాలలో ఒక వైపు పశుపతినాథ క్షేత్ర మహిమ, నేపాల్ దేశపు ఆధ్యాత్మిక చరిత్ర, ఆదిశంకర భగవత్పాదుల అనుబంధం వంటి అంశాలు ప్రతిధ్వనించగా, మరో వైపు ఆధునిక మానవునికి అత్యంత అవసరమైన ధర్మబోధ, పుణ్యపాప సిద్ధాంతం, పునర్జన్మ తాత్త్వికత, శాస్త్రాల ప్రామాణ్యం, జీవిత సార్థకత వంటి అంశాలు సులభంగా, స్పష్టంగా, లోతుగా వివరిస్తూ మహోన్నత సందేశాన్ని అందించాయి.

### మంగళాచరణంతో ఆరంభమైన ధర్మసందేశం

జగద్గురువుల అనుగ్రహ భాషణం పవిత్ర మంగళాచరణంతో ప్రారంభమైంది.

**"శృతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం।**
**నమామి భగవత్పాద శంకరం లోకశంకరం॥"**

అనే ప్రసిద్ధ శ్లోకంతో భగవత్పాద శ్రీ ఆదిశంకరాచార్యులను స్మరించారు. శృతి, స్మృతి, పురాణాలకు నిలయమైన, కరుణా సాగరుడైన, లోకక్షేమం కోసం అవతరించిన ఆది శంకర భగవత్పాదులు సనాతన ధర్మ పునరుద్ధరణకు చేసిన మహోపకారం భాషణమంతటికీ ఆధ్యాత్మిక పునాది అయింది.





ఆది శంకరాచార్యులు కేవలం ఒక తత్వవేత్త మాత్రమే కారు. వారు సనాతన ధర్మానికి పునర్జీవం ప్రసాదించిన మహామహులు. వారు ఉపనిషత్తుల సారాన్ని అద్వైత వేదాంత రూపంలో స్థాపించి, జీవన పరమార్థాన్ని మోక్షమార్గంతో అనుసంధానించి, భారతీయ ఆధ్యాత్మికతను శాస్త్రబద్ధంగా, తాత్త్వికంగా, అనుభవ యోగ్యంగా ప్రపంచానికి అందించారు.

### పశుపతినాథ క్షేత్ర మహిమ

నేపాల్ దేశంలో వెలసిన శ్రీ పశుపతినాథ క్షేత్రం హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన శైవక్షేత్రాలలో ఒకటి. ఈ క్షేత్రంలో భగవాన్ పరమేశ్వరుడు పశుపతినాథ స్వరూపంలో భక్తుల ఆరాధనను స్వీకరిస్తూ, వారికి శ్రేయస్సు, శాంతి, మంగళం ప్రసాదిస్తున్నాడని జగద్గురువులు పేర్కొన్నారు.

పురాణాలు, ఇతిహాసాలు ఈ క్షేత్ర వైభవాన్ని అనేక విధాలుగా గానించాయి. భగవంతుని దివ్యసాన్నిధ్యం, వేదఘోష, ఆచార సంప్రదాయాలు, భక్తుల విశ్వాసం, సనాతన ధర్మాచరణ - ఇవి అన్నీ కలసి పశుపతినాథ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక చైతన్యానికి చిహ్నంగా నిలిపాయి.

జగద్గురువులు ఈ పుణ్యభూమిని దర్శించడం తమకు భాగ్యమని పేర్కొంటూ, నేపాల్ దేశమంతటా విస్తరించి ఉన్న అనేక తీర్థక్షేత్రాలను, అక్కడి ప్రజల భక్తిశ్రద్ధలను ప్రత్యేకంగా అభినందించారు. అనాదికాలం నుండి నేపాల్ ప్రజలు సనాతన హిందూ ధర్మాన్ని విశ్వాసంతో, ఆచారనిష్ఠతో, భక్తిపూర్వకంగా అనుసరిస్తూ వస్తున్నారని వారు ప్రశంసించారు.

### ఆదిశంకరుల నేపాల్ అనుబంధం

భగవత్పాద శ్రీ ఆదిశంకరాచార్యులు తమ దిగ్విజయ యాత్రలో భాగంగా శ్రీ పశుపతినాథ క్షేత్రాన్ని దర్శించినట్లు పరంపర ప్రస్తావిస్తుంది. అక్కడ భగవంతుని ఆరాధించి, భక్తులను అనుగ్రహించి, ఈ క్షేత్రంలో ఒక

విశిష్ట ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని స్థాపించినట్లు జగద్గురువులు స్మరించారు. ఆ మహోన్నత సంప్రదాయం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతుండటం సనాతన ధర్మ నిరంతరత్వానికి గొప్ప సాక్ష్యం.

ఆది శంకరులు స్థాపించిన ఈ ధర్మ పరంపర దేశాల పరిమితులను దాటి, సంస్కృతులను కలిపి, ఆధ్యాత్మిక ఏకత్వాన్ని ప్రసాదించే దివ్య శక్తిగా నిలిచింది. రాజకీయ సరిహద్దులు కాలంతో మారవచ్చు; కాని ధర్మ బంధం, గురుపరంపర, వేదసంప్రదాయం, ఆధ్యాత్మిక అనుబంధం శాశ్వతమైనవి. భారతదేశం మరియు నేపాల్ మధ్య ఉన్న అనుబంధాన్ని జగద్గురువులు ఇదే దృష్టితో వివరించారు.

### శృంగేరీ పీఠం - నేపాల్ పవిత్ర బంధం

శ్రీ శృంగేరీ శారదా పీఠం మరియు నేపాల్ దేశం మధ్య అనాదిగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంబంధం ఎంతో విశిష్టమైనది. దక్షిణామ్నాయ శ్రీ శారదా పీఠం యొక్క 35వ జగద్గురు శ్రీ శ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వాములు సుమారు అరవై సంవత్సరాల క్రితం నేపాల్ పుణ్యభూమిని దర్శించిన సందర్భంగా అక్కడి మహారాజు, అధికారులు, పండితులు, భక్తులు ఘనంగా స్వాగతించి సత్కరించిన విషయాన్ని జగద్గురువులు స్మరించారు.

అరవై సంవత్సరాల అనంతరం మళ్లీ ఈ పవిత్ర భూమిని దర్శించగలగడం భగవాన్ పశుపతినాథుని అనుగ్రహమని వారు పేర్కొన్నారు. ఈ యాత్ర కేవలం ఒక సందర్శనం కాదు; ఇది గురుపరంపరను, శంకర సంప్రదాయాన్ని, వేదధర్మాన్ని, భారత-- నేపాల్ ఆధ్యాత్మిక బంధాన్ని మరింత బలపరిచిన ధర్మ విజయయాత్ర.

### భక్తజనులకు, అధికారులకు కృతజ్ఞతాభివందనం

నేపాల్ యాత్ర సందర్భంగా అందించిన ప్రేమ, భక్తి, విశ్వాసం, ఆత్మీయ స్వాగతం జగద్గురువులకు



పరమానందాన్ని కలిగించిందని వారు హృదయపూర్వకంగా తెలిపారు. నేపాల్ ప్రభుత్వం, భద్రతా దళాలు, సైన్యం, పోలీసు శాఖ, ఆలయ అధికారులు, వేదశాస్త్ర పండితులు, సన్యాసి పరంపరలకు చెందిన పూజ్య స్వామీజీలు, శ్రీ పశుపతినాథ ఆలయ అర్చకులు, భక్తజనులు - అందరికీ తమ ఆశీర్వాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇలాంటి యాత్రలు కేవలం ఉత్సవాలుగా ముగిసిపోవు. అవి భక్తిలో విశ్వాసాన్ని పెంచుతాయి. ధర్మంలో నిబద్ధతను కలిగిస్తాయి. సమాజంలో సత్సంకల్పాన్ని నింపుతాయి. గురుపరంపరపై భక్తిని బలపరుస్తాయి. దేశాల మధ్య ఆధ్యాత్మిక స్నేహాన్ని మరింత పటిష్ఠం చేస్తాయి.

### అద్వైత వేదాంత సందేశం

జగద్గురువుల భాషణంలో అత్యంత ప్రధానమైన అంశం అద్వైత వేదాంత పరమార్థం. ఆది శంకర భగవత్పాదులు ప్రపంచానికి బోధించిన అద్వైత సిద్ధాంతం ప్రకారం, భిన్నత్వం బాహ్యదృష్టికి కనిపించేది మాత్రమే. వాస్తవానికి సమస్త చరాచర జగత్తులో ఒకే పరబ్రహ్మ స్వరూపం అనేక రూపాలలో వ్యక్తమవుతోంది.

ఈ సత్యాన్ని గ్రహించినప్పుడు మనుషుల మధ్య ఉన్న భేదభావాలు, విభేదాలు, అసూయలు, సంఘర్షణలు క్రమంగా తొలగిపోతాయి. సర్వజీవరాశులలో ఒకే




ఆత్మతత్త్వం వెలుగుతున్నదనే భావన మానవునిలో కరుణను, సౌహార్ద్రాన్ని, సహనాన్ని, సమైక్యతను పెంచుతుంది. ఇదే అద్వైత వేదాంతం యొక్క ప్రాయోగిక మహిమ.

జగద్గురువులు ఈ భావాన్ని భారతదేశం – నేపాల్ అనుబంధానికి అన్వయిస్తూ, రాజకీయంగా ఇవి వేర్వేరు దేశాలైనా, ధర్మం, సంస్కృతి, వేదపారంపర్యం, ఆధ్యాత్మిక సంప్రదాయం పరంగా ఒకే ఆధ్యాత్మిక కుటుంబంగా నిలిచాయని వివరించారు.

## ఆధునిక యుగంలో ధర్మం అవసరమా?

జగద్గురువుల ధర్మోపదేశంలో ఆధునిక మానవుని మనసులో కలిగే ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. ఈ రోజులు విజ్ఞానశాస్త్ర యుగం. సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా అభివృద్ధి చెందింది. ప్రయాణం, సమాచార మార్పిడి, వైద్యం, యంత్రాంగం, జీవన సౌకర్యాలు – ఇవి అన్నీ గతంతో పోలిస్తే ఎంతో మెరుగుపడ్డాయి. అప్పుడు ధర్మం, అధర్మం, పుణ్యం, పాపం వంటి భావనలు ఇప్పటికీ అవసరమా అనే ప్రశ్న కొందరిలో తలెత్తవచ్చు.

జగద్గురువులు ఈ ప్రశ్నకు అత్యంత సరళంగా, స్పష్టంగా సమాధానం చెప్పారు. సాంకేతిక విజ్ఞానం మానవునికి సౌకర్యాలను ఇవ్వగలదు. కాని నిజమైన సుఖాన్ని, అంతరంగ శాంతిని, జీవన సార్థకతను అది ప్రసాదించలేదు. ఒకప్పుడు కష్టసాధ్యమైన పనులు ఇప్పుడు క్షణాల్లో పూర్తవుతున్నా, మానవుని భయం, ఆందోళన, మానసిక వేదన, అసంతృప్తి పూర్తిగా తొలగిపోయాయా? సమాధానం లేదు.

అందువల్ల సౌకర్యం వేరు, సుఖం వేరు అనే విషయాన్ని మనం గ్రహించాలి. సౌకర్యాన్ని విజ్ఞానం ఇవ్వవచ్చు. కానీ సుఖాన్ని ధర్మం మాత్రమే ప్రసాదిస్తుంది.

## ధర్మమే సుఖానికి మూలం

మన శాస్త్రాలు స్పష్టంగా ఉపదేశిస్తున్నాయి – ధర్మం సుఖానికి మూలకారణం; అధర్మం దుఃఖానికి మూలకారణం. మనిషి ఎంత చదువుకున్నా, ఎంత సంపాదించినా, ఎంత సాంకేతిక సౌకర్యాలు పొందినా, అతని జీవితం ధర్మబద్ధంగా లేకపోతే అంతరంగ శాంతి లభించదు.

ధర్మం అనేది కేవలం ఆచారపద్ధతుల సమాహారం కాదు. అది జీవన నియమం. అది మనిషి ఆలోచనలను శుద్ధిపరచే శక్తి. అది కర్మను పవిత్రం చేసే మార్గం. అది వ్యక్తిని కుటుంబానికి, కుటుంబాన్ని సమాజానికి, సమాజాన్ని లోకక్షేమానికి అనుసంధానించే దివ్య సూత్రం.


ధర్మాన్ని ఆచరించే వ్యక్తి ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా, తన హృదయంలో ఒక స్థిరత్వాన్ని, ఒక శాంతిని, ఒక భగవదాధీన భావాన్ని పొందగలడు. ఇదే ధర్మజీవన మహిమ.

### పుణ్యం - పాపం : కర్మఫల సిద్ధాంతం

జగద్గురువులు పుణ్యం, పాపం అనే శాస్త్రీయ ధార్మిక భావనలను కూడా స్పష్టంగా వివరించారు. ప్రతి మనిషి చేసే ప్రతి కర్మకు ఒక ఫలితం తప్పక ఉంటుంది. ధర్మానుసారంగా చేసిన కర్మ పుణ్యాన్ని ఇస్తుంది. అధర్మానుసారంగా చేసిన కర్మ పాపాన్ని కలిగిస్తుంది.

పుణ్యం, పాపం మన కంటికి కనిపించకపోవచ్చు. కానీ అవి మన జీవితంలోని సుఖదుఃఖాలకు కారణ మవుతాయి. ఒక విత్తనం భూమిలో కనిపించకపోయినా, కాలక్రమంలో మొలకెత్తి ఫలితాన్ని ఇస్తుంది. అలాగే కర్మలు కూడా తగిన సమయంలో తగిన ఫలితాన్ని ఇస్తాయి.

ఈశ్వరుడు తన అచంచలమైన నియమం ప్రకారం ప్రతి కర్మకు తగిన ఫలితాన్ని ప్రసాదిస్తాడు. మనం చేసే కర్మల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ధర్మబద్ధమైన జీవితం గడపాలని ఈ సిద్ధాంతం మనకు బోధిస్తుంది.





### పునర్జన్మ తాత్వికత

జీవితంలో కనిపించే అసమానతలపై కూడా జగద్గురువులు లోతైన దృష్టిని ప్రసాదించారు. ఒక శిశువు జన్మించిన వెంటనే ఒకరికి సంపద, మరొకరికి దారిద్ర్యం; ఒకరికి ఆరోగ్యం, మరొకరికి వ్యాధి; ఒకరికి సుఖమైన పరిస్థితులు, మరొకరికి కఠిన పరిస్థితులు కనిపిస్తాయి. ఈ జన్మలో ఇంకా ఏ కర్మ చేయని శిశువులకు ఈ భేదాలు ఎందుకు?

కారణం లేకుండా కార్యం ఉండదనే న్యాయం ఇక్కడ వర్తిస్తుంది. ఈ జన్మలో కనిపించని కారణం గత జన్మలలో చేసిన కర్మలేనని మన శాస్త్రాలు బోధిస్తున్నాయి. అందుకే పునర్జన్మ సిద్ధాంతం కర్మసిద్ధాంతంతో గాఢంగా అనుసంధానమై ఉంది.

ఈ భావన మనిషిని నిరాశకు గురిచేయడం కోసం కాదు. దానివల్ల మనిషి తన వర్తమాన జీవితం పట్ల మరింత జాగ్రత్తగా మారాలి. గతకర్మ ఫలితాలను ధైర్యంగా అనుభవిస్తూ, ఈ జన్మలో ధర్మబద్ధమైన కర్మల ద్వారా శ్రేయోమార్గంలో నడవాలి.




## శాస్త్రాలు ప్రశ్నకు సమాధానం చెప్పే దివ్యజ్ఞానం

మన సనాతన ధర్మ శాస్త్రాల విశిష్టతను జగద్గురువులు ప్రత్యేకంగా తెలియజేశారు. మన శాస్త్రాలు ఎప్పుడూ "ప్రశ్నించకుండా నమ్మండి" అని బోధించవు. అవి తర్కాన్ని అందిస్తాయి. ప్రమాణాలను చూపిస్తాయి. సందేహాలకు సమాధానాలను వివరిస్తాయి.

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, దర్శనశాస్త్రాలు, భాష్యాలు, వార్తికాలు – ఇవన్నీ అపారమైన జ్ఞాన భాండాగారాలు. ఇవి కేవలం పఠనార్థ గ్రంథాలు కాదు. ఇవి జీవన మార్గదర్శకాలు. ఇవి మనిషిని అజ్ఞానం నుండి జ్ఞానానికి, అశాంతి నుండి శాంతికి, బంధనము నుండి మోక్షానికి నడిపించే దివ్య సోపానాలు.

## జీవనోపాధి అవసరం; జీవనసార్థకత ధర్మం

జగద్గురువుల ముగింపు సందేశం ప్రతి గృహస్థునికీ, ప్రతి విద్యార్థికీ, ప్రతి వృత్తిజీవికీ, ప్రతి భక్తునికీ ఆచరణీయమైనది. మనిషి జీవనోపాధి కోసం శ్రమించాలి. ధర్మబద్ధంగా సంపాదించాలి. కుటుంబాన్ని పోషించాలి. సమాజం పట్ల తన బాధ్యతలను నిర్వర్తించాలి. ఇవన్నీ అవసరమైనవే.

అయితే ఇవన్నీ జీవితాన్ని నడిపించే సాధనాలు మాత్రమే. జీవితాన్ని సార్థకం చేసేది ధర్మం. ధర్మం వల్ల పుణ్యం లభిస్తుంది. పుణ్యం వల్ల శాంతి, సుఖం కలుగుతాయి. చివరకు అదే మోక్షానికి దారి తీస్తుంది.

అందువల్ల ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కొంత సమయాన్ని ధర్మాచరణకు, భగవదారాధనకు, శాస్త్రాధ్యయనానికి, సత్సంగానికి కేటాయించాలి. ధర్మం జీవితంలో ఒక భాగం మాత్రమే కాకుండా, జీవితాన్ని నడిపించే కేంద్రబిందువుగా ఉండాలి.

## భారత - నేపాల్ ఆధ్యాత్మిక ఏకత్వానికి యాత్ర సందేశం

నేపాల్ ధర్మ విజయయాత్ర ద్వారా జగద్గురువులు అందించిన సందేశం కేవలం నేపాల్ భక్తులకు మాత్రమే సంబంధించినది కాదు. అది సమస్త హిందూ సమాజానికి వర్తించే శాశ్వత ధర్మబోధ. పశుపతినాథుని సన్నిధిలో




జరిగిన ఈ అనుగ్రహ భాషణం భారత--నేపాల్ ఆధ్యాత్మిక అనుబంధానికి మరొక పవిత్ర అధ్యాయంగా నిలిచింది.

భారతదేశం, నేపాల్ వేర్వేరు దేశాలైనా, వేద సంస్కృతి, ఈశ్వర వైభవం, శంకర సంప్రదాయం, భక్తి పారంపర్యం, తీర్థక్షేత్ర మహిమల ద్వారా అవి ఒకే ధర్మ కుటుంబంగా అనుసంధానమై ఉన్నాయి. ఈ అనుబంధం భవిష్యత్తులో మరింత బలపడాలని జగద్గురువులు శ్రీ పశుపతినాథుని ప్రార్థించారు.

శ్రీ పశుపతినాథ క్షేత్ర సన్నిధిలో జగద్గురువులు ప్రసాదించిన అనుగ్రహ భాషణాలు ఆధునిక సమాజానికి అమూల్యమైన మార్గదర్శకం. విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ధర్మం లేకుండా మానవజీవితం సంపూర్ణం కాదని అవి స్పష్టం చేశాయి. సౌకర్యాలు బాహ్యజీవితాన్ని సులభం చేస్తాయి; కానీ ధర్మం అంతరంగాన్ని పవిత్రం చేస్తుంది. శాస్త్రజ్ఞానం బుద్ధిని ప్రకాశింపజేస్తుంది; భక్తి హృదయాన్ని మృదువుగా చేస్తుంది; గురువాక్యం జీవనానికి దిశానిర్దేశం చేస్తుంది.

ధర్మబద్ధమైన ఆలోచన, పుణ్యకర్మ, భగవదారాధన, శాస్త్రాధ్యయనం, సత్సంగం – ఇవి మానవుని నిజమైన సంపదలు. ఇవే శాంతికి మార్గం. ఇవే సుఖానికి మూలం. ఇవే మోక్షానికి పునాది.

**హర నమః పార్వతీపతయే । హర హర మహాదేవ ॥**

**శృంగేరి జగద్గురువులకు సాష్టాంగ ప్రణామాలతో**
**జగద్గురు శ్రీచరణుల పాదరేణువు**
**మరుమాముల వేంకట రమణశర్మ**
**'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సంపాదకులు**




नागेश्वर


















श्री मुक्तिनाथ मन्दिर
SHRI MUKTINATH TEMPLE
ॐ नमो भगवते वासुदेवाय
श्री मुक्तिनाथ धाम
SHRI MUKTINATH DHAM
MUKTINATH, NEPAL
Altitude : 3710 m.